శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 22.2

### 123 వాటర్ క్యాంప్‌లు

వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చడానికి నగరవ్యాప్తంగా 123 ప్రత్యేక తాగునీటి శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో శుక్రవారం ఎండీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంచినీటి శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ, ఇతర సమస్యలు పరిష్కారానికి నోడల్ అధికారులను నియమించినట్లు అశోక్ రెడ్డి తెలిపారు. ఏరియాకు ఒక రూట్ ఆఫీసర్‌ను సైతం నియమించినట్లు పేర్కొన్నారు. రానున్న 72 గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటిలో క్లోరిన్ లెవెల్స్ పరీక్షించాలని సిబ్బందికి సూచించారు.

### సైబరాబాద్‌లో సర్వం సిద్ధం

గణేశ్ నిమజ్జనం నేపథ్యలో సైబరాబాద్ పరిధిలో క్షేత్రస్థాయిలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కూకట్‌పల్లిలోని ఐడీఎల్ లేక్, రాజేంద్రనగర్ పత్తికుంట, పల్లెచెరువు, జీడిమెట్లలోని కట్టమైసమ్మ ట్యాంక్, ప్రగతినగర్ లేక్, గంగారం లేక్‌ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. వినాయకులతో ఉన్న వాహనాలు మాత్రమే ఆ మార్గంలో రావాలని జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావ్ భూపాల్ సూచించారు. కూకట్‌పల్లి నుంచి మాదాపూర్ వైపు వచ్చే వాహనదారులు జేఎన్‌టీయూ మీదుగా వెళ్లాలని సూచించారు.



పీపుల్స్ ప్లాజా వద్ద నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్లు, నిమజ్జనానికి తరలివస్తున్న గణనాథులు



గంగ ఒడికి తరలుతున్న బొజ్జ గణపయ్యలు





నిమజ్జనోత్సవంలో డప్పులతో బాలల సందడి

### 2.7 లక్షల విగ్రహాల నిమజ్జనం

గ్రేటర్ వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నాటికి 2.7 లక్షల గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎల్‌బీనగర్ జోన్‌లో 33,047, చార్మినార్ జోన్‌లో 18,561, ఖైరతాబాద్‌జోన్‌లో 38,212, శేరిలింగంపల్లి జోన్‌లో 35,325, కూకట్‌పల్లి జోన్‌లో 55,572, సికింద్రాబాద్ జోన్‌లో 26,540 ప్రతిమలను నిమజ్జనం చేశారు.



ట్యాంక్‌బండ్‌పై సిద్ధంగా ఉన్న క్రేన్లు

# ఆ 19 కిలోమీటర్లే కీలకం!

- శోభాయాత్ర మార్గంలో పటిష్ట బందోబస్తు
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు
- టస్కర్ డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- ఎక్కడికక్కడ నిఘా

## మహా నిమజ్జనానికి యంత్రాంగం అప్రమత్తం

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహా నిమజ్జనం సందర్భంగా బాలాపూర్ గణేశ్ విగ్రహం మొదలుకొని హుస్సేన్‌సాగర్ వరకు గల ప్రధాన శోభాయాత్ర మార్గం (19 కిమీ)లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయని సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ వెల్లడించారు. ట్రాఫిక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గణేశ్ శోభాయాత్ర, నిమజ్జనం వేడుకలకు సుమారు 10 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. 30 వేల సిబ్బందితో పటిష్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌ఏఎఫ్, పారా మిలటరీ బలగాలను అందుబాటులో ఉంచామన్నారు. ఖైరతాబాద్ బడా గణేశ్ (69 అడుగులు) శోభాయాత్ర సుమారు 2.5 కిలోమీటర్ల కొనసాగుతుందన్నారు. ఇందుకోసం రెండు షిఫ్టుల్లో 80 మంది సిబ్బంది పనిచేస్తారన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపులు..**

గణేష్ నిమజ్జనం సందర్భంగా గురువారం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని కచ్చితంగా నగరవాసులు పోలీసులకు సహకరించాలన్నారు. సికింద్రాబాద్, నార్త్‌జోన్,



మిగతా 6వ పేజీలో..

**ప్రధాన మార్గం ఇదే**

ప్రధానంగా గణేశ్ శోభాయాత్ర బాలాపూర్ నుంచి కేశవగిరి చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్, లెఫ్ట్ టర్న్ ఎంబీఎన్‌ఆర్ ఎక్స్ రోడ్డు, ఫలక్‌నుమా రైల్వే బ్రిడ్జి, అలియాబాద్, నాగుల్చింత, చార్మినార్ మదీనా, అఫ్జల్ బగూర్జాల్ మీదుగా ఎంజేమార్కెట్ అబిడ్స్ ఎక్స్ రోడ్డు, బషీర్‌బాగ్ లిబర్టీ, ఎన్టీఆర్ మార్గ్, అంబేడ్కర్ విగ్రహం, పీవీఎన్ఆర్ మార్గ్ నెక్లెస్ రోడ్డు వరకు సాగుతుంది.



### చకచకా బడా గణేశ్ నిమజ్జన పనులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 5, (ఆంధ్రజ్యోతి): మహా నిమజ్జనంలో మొదట ఖైరతాబాద్ గణపతిని నిమజ్జనం చేయాలనే లక్ష్యంతో పోలీసులు దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి షెడ్డు కర్రల తొలగింపు పనులు ప్రారంభం కాగా అవి రాత్రి వరకు జరిగాయి. రాత్రి 12.00 గంటలకు కళశ పూజ చేసి విగ్రహాన్ని కదిలించిన అనంతరం చివరి పూజలు చేసి గణపతిని పెద్ద ట్రాలీ పైకి ఎక్కిస్తారు. ఉదయం 6 నుంచి 6.30 మధ్యన శోభాయాత్ర ప్రారంభిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో గణపతిని శనివారం మధ్యాహ్నం 1 నుంచి 1.30 లోపల నిమజ్జనం చేస్తామని ఇన్‌చార్జి అధికారి, ఏసీపీ సంజయ్ కుమార్ తెలిపారు. కాగా, ఉత్సవాల 9వ రోజు హుస్సేన్‌సాగర్ వద్దకు గణపతి విగ్రహాల నిమజ్జనం శుక్రవారం మధ్యాహ్నం వరకు సాగింది.

### భక్తులు సహకరించాలి

- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పొన్నం

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహా నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగేలా ఏర్పాట్లు చేశామని, కీలక ఘట్టం ప్రశాంత వాతావరణంలో జరిగేలా భక్తులు సహకరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. శుక్రవారం హుస్సేన్‌సాగర్ తీరంలో నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరిగే ఎన్‌టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెంబర్ 4, 5 వద్ద పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వంలో జీహెచ్‌ఎంసీ, పోలీస్, ఇతర విభాగాలు సమగ్ర ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఉత్సవ సమితితో సమన్వయం చేసుకుంటూ ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జనం వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇన్సిడెంట్ ఫ్రీగా నిమజ్జనం జరిగేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులున్నారు.



కమిషనర్ కర్ణన్‌తో చర్చిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### వెల్లివిరిసిన మత సామరస్యం

- ఒకవైపు వినాయక నిమజ్జనాలు.. మరోవైపు మిలాద్ ఉన్ నబీ

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మత సామరస్యం వెల్లివిరిసింది. ఒకవైపు వినాయక నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలు, మరోవైపు మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం కన్నుల పండువగా జరిగాయి. పది రోజులుగా గణపతి మండపాల్లో రోజూ సాయంత్రం వేళల్లో భజనలు, భక్తి గీతాలతో అర్చనలు చేసి హిందువులంతా భక్తి ప్రపత్తులను చాటుకుంటున్నారు. కాగా, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శనివారం పలు ప్రాంతాల్లో ముస్లింలు మసీదుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో స్థానికంగా ఊరేగింపులు చేపట్టారు. చార్మినార్, ముషీరాబాద్, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాల్లో హిందూ-ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వినాయకుడి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలకు అంతరాయం కలుగకుండా ముస్లింలు శుక్రవారం మిలాద్‌ఉన్ నబీ వేడుకలను సాదాసీదాగా నిర్వహించి సెప్టెంబరు 14 ఆదివారం భారీగా ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అంగన్‌వాడీ.. సౌకర్యాలు కొరవడి!

## జిల్లాలో అధ్వానంగా కేంద్రాలు.. కొన్ని సెంటర్లలో ఊపిరాడని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా మారాయి. నిర్వహణ భారంతో కునారిల్లుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారని తల్లిదండ్రులు వాపోతున్నారు. జిల్లాలోని చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 419 మినీ సెంటర్లుగా నడుస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం సుమారు గర్భిణులు 8,948 మంది, బాలింతలు 14,258, 0-6 ఏళ్ల పిల్లలు 1,78,280 మంది ఉన్నారు. అయితే జిల్లాలోని మొత్తం 973 కేంద్రాల్లో 705 అద్దె ఇళ్లలో నడుస్తుండగా, మిగతా 268 జీహెచ్ఎంసీకి చెందిన కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.

**ఏడాదికి రూ.3.36 కోట్ల అద్దె**

వాస్తవంగా ప్రభుత్వ పాఠశాలలకు అనుబంధంగా అంగన్‌వాడీ సెంటర్లను కొనసాగించాలని అప్పట్లో ప్రభుత్వం భావించింది. అయితే హైదరాబాద్ జిల్లాలోని సర్కారు స్కూళ్లలో చాలావరకు గదుల కొరత ఉండడంతోపాటు ఏటా జనాభా పెరుగుతుండడంతో బస్తీలు, కాలనీల్లో ఎక్కువ మొత్తంలో పెద్ద, మినీ సెంటర్లను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో చాలా చోట్ల అద్దె భవనాల్లో సెంటర్లను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పలుచోట్ల రెండు, మూడు గదులున్న ఇంటిని కిరాయికి తీసుకోవడంతో ప్రతి నెలా అద్దె రూ.5 నుంచి రూ.6వేల వరకు చెల్లిస్తున్నారు. కాగా, కమ్యూనిటీ హాళ్లలో నడిచే వాటికి రూ.750 సాధారణ అద్దెను చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా, జిల్లాలోని 705 కిరాయి భవనాలకు నెలకు రూ.28 లక్షలు, ఏడాదికి రూ.3.36 కోట్లు కట్టాల్సి వస్తోంది.

**ఇరుకు గదుల్లో చిన్నారుల ఇబ్బందులు**

అద్దె గదుల్లో నడుస్తున్న అంగన్‌వాడీల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల కేవలం చిన్నపాటి గదిలోనే 15 నుంచి 20 మంది కిశోర బాలలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. దీంతో వెంటిలేషన్ సరిగా లేకపోవడంతో పిల్లలకు ఊపిరాడని పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో టీచర్లు, ఆయాలు కూడా అవస్థలు పడుతున్నారు. తక్కువ కిరాయి ఇళ్లలో కేంద్రాలను నడిపించాల్సి వస్తుండడంతో పిల్లలు ఆడుకునే అవకాశం లేకుండా పోతోందని చెబుతున్నారు. కొన్నేళ్లుగా సొంత భవన నిర్మాణాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో చిన్నపాటి అద్దె గదుల్లోనే పిల్లలను కూర్చోబెట్టడం, వంట సామగ్రి, పోషకాహారాన్ని భద్రపరుచుకోవడం ఇబ్బందిగా మారిందని, వర్షాకాలంలో చాలా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

**సొంత భవనాల కోసం ఎదురుచూపులు**

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారులు ప్రతిపాదనలు పంపిస్తున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని తెలుస్తోంది. కాగా, రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలను చూపించి నిర్మాణాలకు ప్రయత్నం జరుగుతున్నప్పటికీ హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి లేదని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.



కాళీమందిర్‌లోని ఓ కేంద్రంలో పిల్లలు

# 97 ప్రజెంట్ సార్..!

- జేఎన్‌టీయూ కాలేజీలో కిటకిటలాడుతున్న తరగతి గదులు
- అసాధారణ సంఖ్యలో విద్యార్థులు.. అర్థం కాని చదువులు
- ప్రొజెక్టర్లు, సౌండ్ బాక్సులు కరువు



జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ భవనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక జేఎన్‌టీయూ కాలేజీలో తరగతి గదులు కిటకిటలాడుతున్నాయి. ఈ ఏడాది విపరీతంగా పెరిగిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఆచార్యులను (కాంట్రాక్ట్ లేదా గెస్ట్) నియమించుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. సాధారణంగా 66 నుంచి 72 మంది మాత్రమే ఉండాల్సిన తరగతి గదుల్లో, 80 నుంచి 97 మంది దాకా విద్యార్థులను చొప్పించారు. మొత్తం 13 (ఏ నుంచి ఎం వరకు) సెక్షన్లు ఉండగా, కొన్ని సెక్షన్లకు తరగతులు చాలకపోవడంతో వాటిని సెమినార్ హాల్స్‌లోకి మార్చారు. సెమినార్ హాల్స్‌లో ఉడ్‌వర్క్ పాడైపోవడంతో పాఠాలు చెబుతున్న ఆచార్యుల మాటలకు రీసౌండ్ వస్తున్నట్లు తెలుస్తోంది. ఆచార్యులు గట్టిగా అరచి చెబుతున్నా వారి మాటలు చివరి బెంచీల్లో కూర్చున్న విద్యార్థులకు వినిపించడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆయా హాల్స్‌లో ప్రొజెక్టర్లు వేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠాలు చెప్పేందుకు వీలున్నా, ప్రొజెక్టర్లను కానీ, సౌండ్ బాక్సులను కొనుగోలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

**రెగ్యులర్ ఫ్యాకల్టీతో బోధనే మేలు: ప్రిన్సిపాల్**

ఫస్టియర్ విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలో ఇబ్బందులు విషయమై కళాశాల ప్రిన్సిపాల్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. 'గెస్ట్ ఫ్యాకల్టీతో బోధన కంటే రెగ్యులర్ ప్రొఫెసర్స్‌తో బోధన ఉత్తమమని భావించాం. ఆ మేరకు ఆచార్యులకు వర్క్‌లోడ్‌ను పెంచాం. ఈ విషయమై వైస్‌చాన్స్‌లర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. సెమినార్‌హాల్స్‌లో సౌండ్ బాక్స్‌ల అవశ్యకత ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరితగతిన ఏర్పాటు చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం' అని అన్నారు.

**10 మంది ఫ్యాకల్టీని నియమించుకోలేరా**

గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా విదేశీ ఎంఓయూ కోర్సుల కారణంగా రెండు సెక్షన్లకు విద్యార్థులు పెరిగారు. ప్రత్యేకించి స్వీడన్, జర్మనీ ఎంఓయూ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సరిపడా ఫ్యాకల్టీని

మిగతా 6వ పేజీలో..

# మహానగరంలో గోదావరి జలాలు బంద్

## వాల్వుల మార్పిడి నేపథ్యంలో.. 9, 10 తేదీల్లో పలు ప్రాంతాలకు అంతరాయం



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్ మహా నగరానికి గోదావరి జలాలు బంద్ కానున్నాయి. పలు ప్రాంతాలకు 48 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్-1 పథకంలో భాగంగా మర్కుక్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 మి.మీ డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌పై అమర్చిన 900 మిమీ డయా వాల్వుల మార్పిడి పనులు చేయనున్నారు. ఈ నెల 9న ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు ఈ పనులు నిర్వహించనున్నారు. దీంతో నీటి సరఫరాలో అంతరాయం కలగనుంది.

**అంతరాయం తలెత్తే ప్రాంతాలు**


"ఎస్‌ఆర్ నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎస్‌పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళరావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్ సెక్షన్లు, జూబ్లీహిల్స్ కొంత భాగం, తట్టిఖానా కొంత భాగం, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మ బండ. మూసాపేట్, భరత్‌నగర్, మోతీనగర్,

మిగతా 6వ పేజీలో..



**అశ్వికదళంలో మహిళలు** 6

- మొదటిసారిగా నిమజ్జన బందోబస్తులో వినియోగించాలని నిర్ణయం



**నిజాం కళాశాలకు న్యాక్ ఏ-గ్రేడ్ సర్టిఫికెట్** 6

- ప్రిన్సిపాల్ ఏ.వి.రాజశేఖర్

### ఫోన్‌లో బ్యాలెన్స్ లేదన్నందుకు దాడి

- ముగ్గురు కలిసి ప్రతి దాడి చేయగా యువకుడి మృతి

బంజారాహిల్స్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'నా సెల్ స్విచ్ఛాఫ్ అయ్యింది. మీ సెల్ ఇస్తే కాల్ చేసుకొని ఇస్తానన్నాడు. ఎదుటి వ్యక్తి నుంచి బ్యాలెన్స్ లేదని సమాధానం రావడంతో చేయి చేసుకున్నాడు. తండ్రి, ఇద్దరు కలిసి యువకుడిపై ప్రతిదాడి చేయగా మృతిచెందాడు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోడ్డు నంబరు 14కు చెందిన శ్రీధర్(30) ఈవెంట్స్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న తన వద్దకు స్నేహితుడు రావడంతో అతడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని రోడ్డునంబరు 2లోని బస్టాప్‌లో దించేశాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు నంబరు 14 ఆశా హాస్పిటల్ వద్దకు చేరుకున్నాడు. ఇంతలో తన సెల్ స్విచ్ఛాఫ్ కావడాన్ని గుర్తించి ఆసుపత్రి వాచ్‌మన్ వెంకటయ్యను ఫోన్ అడిగాడు. తన ఫోన్‌లో బ్యాలెన్స్ లేదని వెంకటయ్య చెప్పాడు. దీంతో శ్రీధర్ ఫోన్ ఇవ్వడం ఇష్టం లేక అబద్ధం చెబుతావా అంటూ అడిగాడు. మాటమాటా పెరుగగా వెంకటయ్య పై శ్రీధర్ చేయిచేసుకున్నాడు. వెంటనే వాచ్‌మన్ తన కుమారులు హరికృష్ణ, తరుణ్‌లను పిలిచాడు. ముగ్గురు కలిసి శ్రీధర్‌ను సెల్లార్‌లోకి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టారు. దెబ్బలతో ఇంటికి వచ్చిన శ్రీధర్ స్పృహ కోల్పోయాడు. అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే శ్రీధర్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ● ప్రతీ ఒక్కరికి ఉపాధ్యాయుడే ఆదర్శం



సన్మార్గంలో నడిచే ప్రతీ ఒక్కరికి ఉపాధ్యాయుడే ఆదర్శ గురువని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్.జి.రామేశ్వర్ రావు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఇంజనీర్ కొండలరావు, రాజశేఖరరెడ్డి, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గిరిధర్‌లను డైరెక్టర్ సత్కరించారు.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :

## ● సమాజ నిర్మాణంలో టీచర్స్‌దే కీలక పాత్ర



సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర వహిస్తారని టీపీసీసీ అధ్యక్షుడు, మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో మహబూబ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మహబూబ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు, లెక్చరర్‌లను సన్మానించింది. రెజిమెంటల్‌బజార్, (ఆంధ్రజ్యోతి):

## ● రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్

### పండగల దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్ సెప్టెంబరు5, (ఆంధ్రజ్యోతి): రానున్న దసరా, దీపావళి, ఛట్‌ల పండగల దృష్ట్యా ప్రయాణికుల కోసం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక రైళ్లను నడపడానికి దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే రద్దీ నెలకొన్న దృష్ట్యా కొన్ని రైళ్లను సనత్‌నగర్-అమ్ముగూడ-మౌలాలీ-చర్లపల్లి మీదుగా మళ్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా సికింద్రాబాద్ ప్లాట్ ఫాం 10 వైపు 200 కార్ల పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అదనపు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామని, టికెట్ కౌంటర్లు, ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా అనే సదుపాయాలు వినియోగంలోకి రాబోతున్నట్లు తెలిపారు.

## ఓనం .. ఘనం




కేర్ ఆస్పత్రుల్లో ఓనం ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీని అన్ని బ్రాంచ్ ఆస్పత్రుల్లో ఈ వేడుకలను జరిపారు. పలుచోట్ల పూలతో చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సిబ్బంది.. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వైద్యులు, నర్సులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు. హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



నిజాం కళాశాలకు

# నిజాం కళాశాలకు న్యాక్ ఏ-గ్రేడ్ సర్టిఫికెట్

### ● ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్

బర్కత్‌పుర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎంతో చరిత్ర కలిగిన నిజాం కళాశాలకు నేషనల్ అక్రిడేషన్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ) ఏ గ్రేడ్ సర్టిఫికెట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వి.రాజశేఖర్ తెలిపారు. అదే విధంగా నైరఫ్ ఇండియా ర్యాంకింగ్ 2025 కాలేజీ విభాగంలో 101, 150 రేంజిలో కళాశాల నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ఈ గుర్తింపు పొందిన ఏకైక కళాశాల ఇదేనని శుక్రవారం తెలిపారు. దోస్త్ ద్వారా 97.4 శాతం ప్రవేశాలతో రాష్ట్రంలోనే నిజాం కళాశాల అత్యధిక రేటు సాధించిందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో కూడా మంచి గుర్తింపు పొందిందని తెలిపారు. రిపబ్లిక్ డే వేడుకల్లో ఈ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఢిల్లీకి వెళ్లి పాల్గొన్నారని తెలియజేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు.



నిజాం కళాశాల

## 97 ప్రజెంట్ సార్..!

(5వ పేజీ తరువాయి)

నియమించలేదు. ఇప్పటివరకు ఉన్న రెగ్యులర్ సెక్షన్లలోనూ ఎంటెయూ కోర్సుల్లో చేరిన విద్యార్థులను కలిపేయడంతో ఒక్కో సెక్షన్‌లో 80 నుంచి 97 మంది విద్యార్థులకు ఆచార్యులు బోధన చేయాల్సి వస్తోంది. కాంట్రాక్టు ఫ్యాకల్టీ వారానికి 20 తరగతులు తీసుకుంటుండగా, రెగ్యులర్ ఫ్యాకల్టీకి కేవలం 14 క్లాసులను మాత్రమే కేటాయించారు. అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో ఉండే ఆచార్యులకైతే వారానికి 3 నుంచి 4గంటల బోధన మాత్రమే ఉండడంతో కాంట్రాక్టు ఫ్యాకల్టీపై పని ఒత్తిడి పెరిగినట్లు తెలుస్తోంది. రెగ్యులర్ సెక్షన్‌లలో విద్యార్థుల సంఖ్యకు అదనంగా 30నుంచి 50శాతం విద్యార్థులను కేటాయించడంతో అందరికీ వినపడేలా బోధించడం అటు ఆచార్యులకు, పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం విద్యార్థులకు సవాలుగా మారింది. దీంతో ఎంతో ఆశగా జేఎన్‌టీయూలో చేరిన విద్యార్థులు తీవ్ర నిరాశ, నిస్పృహకు గురవుతున్నారు.

## గంజాయి డాన్ లఖన్‌సింగ్‌పై పీడీ యాక్ట్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి డాన్‌గా పేరుగాంచిన లఖన్ సింగ్‌పై ఎక్సైజ్ పోలీసులు పీడీ యాక్ట్‌ను నమోదు చేశారు. ఇప్పటికే అతడిపై ఎక్సైజ్, పోలీస్టేషన్‌లలో 30కి పైగా కేసులు నమోదయ్యాయి. గడిచిన 8 నెలల్లో ఎనిమిది సార్లు అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళ్‌హాట్, ధూల్‌పేట్, నారాయణగూడ పోలీస్టేషన్‌లలోనూ కేసులున్నాయి. అలాగే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతడిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం సిఫార్సు మేరకు కలెక్టర్ దాసరి హరిచందన పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. గతంలో ఒకసారి దాన్ని ప్రయోగించడం విదితమే.

## అదరగొట్టిన హర్షిత్, అర్జున్

### ● హెచ్‌సీఏ వన్డేలో లార్డ్స్‌పై శ్రీశ్యామ్ గెలుపు



హర్షిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): బ్యాటింగ్‌లో సెంచరీ హీరో వాసిరెడ్డి అర్జున్ (104), బౌలింగ్‌లో వేమూరి హర్షిత్ (3/23) సత్తా చాటడంతో హెచ్‌సీఏ సి డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీశ్యామ్ జట్టు 51 పరుగుల తేడాతో లార్డ్స్ జట్టుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీశ్యామ్.. అర్జున్‌కు తోడు సిద్దార్థ (59) రాణించడంతో 50 ఓవర్లలో 275/9 స్కోరు చేసింది. ఛేదనలో బౌలర్లు హర్షిత్, ఆదిత్య రెడ్డి (3/30) చెలరేగడంతో లార్డ్స్ జట్టు 33.3 ఓవర్లలో 224 పరుగులకే ఆలౌటైంది. లార్డ్స్ కెప్టెన్ శామ్స్ (104) శతక్కొట్టినా ఫలితం లేకపోయింది.

## నైపుణ్యాలకు సరైన వేదికగా న్యాక్

### ● మరింత బలోపేతం చేస్తున్నామన్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (ఎన్ఏసీ) అని, దాన్ని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. టీచర్స్ డే పురస్కరించుకుని న్యాక్ ట్రైనర్ నక్క స్నేహలతకు రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయ ఉత్తమ టీచర్ అవార్డు అందుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఫోన్‌చేసి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 13 మంది ఈ అవార్డుకు ఎంపికైతే.. రాష్ట్రం నుంచి హన్మకొండకు చెందిన స్నేహలతకు అవార్డు రావడం రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. ఆమె వరంగల్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో నిరుద్యోగ యువతకు అందించిన వృత్తి విద్యా కోర్సులు, శిక్షణకు ఈ అవార్డు లభించిందన్నారు. ఈ విజయం న్యాక్‌కు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు. హైదరాబాద్ వేదికగా జిల్లాల్లో శిక్షణ ఇవ్వడమే కాకుండా.. 100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా న్యాక్ పనిచేస్తోందన్నారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు.



జ్ఞాపికలు అందుకున్న ఉపాధ్యాయులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

## వర్సిటీ అధ్యాపకులకు జీతాలేవి?

### ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్న తరుణంలో ఉపాధ్యాయులను గౌరవించలేని స్థితిలో సర్కారు ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని ఓయూ, కాకతీయతోపాటు మిగతా యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకులకు 5వ తేదీ వచ్చినా ప్రభుత్వం వేతనాలు విడుదల చేయడం లేదని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాతృదేవో భావ సత్సంగ్, రామాలయ ఫౌండేషన్ ఢిల్లీ ఆధ్వర్యంలో ప్లాట్స్ సంస్థ సహకారంతో మాజీమంత్రి, దివంగత లక్ష్మీదేవి జ్ఞాపకార్థం ఉపాధ్యాయులను సత్కరించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఓయూలలో కాంట్రాక్ట్ పద్ధతిలో అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తున్నారని ఇది సరైంది కాదని, శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తల్లిని గౌరవించలేని స్థితిలో నేటి రాజకీయ వ్యవస్థ ఉందన్నారు. తల్లిని దూషించే సంస్కృతి భారతీయ చరిత్రలో లేదన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశానికి మార్గదర్శకులని అన్నారు. దేశాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాతృదేవో భావ సత్సంగ్ వ్యవస్థాపకుడు శ్రీధర్, రామాలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## 20 మంది కిడ్నాప్ ప్రచారం అవాస్తవం : సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్

మంగళ్‌హాట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోఠి ఉమెన్స్ యూనివర్సిటీ నుంచి హెల్త్ క్యాంప్ నిమిత్తం వెళ్లిన 20 మంది మహిళలు కిడ్నాప్‌కు గురయ్యారంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తమని సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. రెండు రోజులుగా కోఠి యూనివర్సిటీ నుంచి 20 మంది విద్యార్థులు కిడ్నాప్‌కు గురయ్యారంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరుగుతోందన్నారు. దీంతో వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడికి రాగా వారి తల్లిదండ్రులు ఫోన్ చేసి జాగ్రత్తగా ఉన్నారా లేరా అనే విషయంపై ఆరా తీస్తున్నారన్నారు. వర్సిటీలో గందరగోళం నెలకొనడంతో ఇటు అధికారులు, అటు పోలీసులు విచారణ చేపట్టారన్నారు. కొంత మంది ఆకతాయిలు సృష్టించిన మెసేజ్ కారణంగా తప్పుడు ప్రచారం జరుగుతుందని కొట్టి పారేశారు.

## గణేశ్ ఉత్సవాల్లో పోకిరీలకు ముకుతాడు

### ● ఇప్పటివరకు వెయ్యికి పైగా కేసులు నమోదు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల్లో భాగంగా షీ టీమ్స్ బృందాలు పోకిరీల భరతం పడుతున్నాయి. 10 రోజుల్లో దాదాపు 1000 మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నాయి. పక్కా ఆధారాలు ఉండి మహిళలను, యువతులను వేధించిన వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తున్నామని, మిగతా వారిని కఠినంగా మందలించి పంపుతున్నామని షీ టీమ్స్ ఏసీపీ లక్ష్మీప్రసన్న తెలిపారు. నగర వ్యాప్తంగా 15 షీ టీమ్స్ బృందాలు పని చేస్తుండగా... అందులో 7 బృందాలు ఖైరతాబాద్ గణపతి వద్ద విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్, ట్యాంక్ బండ్, తదితర ప్రాంతాల్లో మఫ్టీలో షీ టీమ్స్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. శనివారం ఖైరతాబాద్ గణపతి శోభాయాత్రతో పాటు నిమజ్జనాలు ముగిసేవరకు బృందాలు పనిచేస్తాయని ఆమె పేర్కొన్నారు.

## మహానగరంలో గోదావరి జలాలు బంద్

(5వ పేజీ తరువాయి)

గాయత్రీనగర్, బాబానగర్, కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, హష్మత్‌పేట్ సెక్షన్, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గజులరామారం, సూరారం. ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్. అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మాచ్చబోలారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయి నగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతమ్‌నగర్. సాయినాథ్‌పురం సెక్షన్, మౌలాలి రిజర్వాయర్, లాలాపేట్ కొంత భాగం, తార్నాకా కొంత భాగం, కాప్రా మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి, సాయిబాబానగర్, రాధికా సెక్షన్లు, కైలాసగిరి పాత, కొత్త రిజర్వాయర్ ప్రాంతాలు.. హౌసింగ్ బోర్డు సెక్షన్, మల్లాపూర్ కొంత భాగం, కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ కొంత భాగం, గచ్చిబౌలి కొంత భాగం, నల్లగండ్ల కొంత భాగం, హఫీజ్‌పేట్. మియాపూర్ సెక్షన్లు, పోచారం, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూముకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం సెక్షన్, అయ్యప్పకాలనీ రిజర్వాయర్ ప్రాంతాలు, నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బోల్లారం, బౌరాంపేట్ సెక్షన్లు.. మెతఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్‌రాక్, హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్, ఏఐఐఎంఎస్‌బీ నగర్, అదేవిధంగా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఆఫ్‌టేక్స్ పరిధిలోని ఆలేర్ (యాదాద్రిభువనగిరి), ఘన్‌పూర్ (మేడ్చల్/శామీర్‌పేట్) ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయం తలెత్తనుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి" అని వాటర్‌బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

## గణనాథుడి లడ్డూ ఉచితంగా పంపిణీ



లడ్డూను పంపిణీ చేస్తున్న శ్రీగణపతి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు సిద్దిఖీ అహ్మద్

రాంనగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా గణేశుడి లడ్డూకు వేలం పాట నిర్వహిస్తారు. కాని రాంనగర్ యూత్ అసోసియేషన్ వారు అందుకు భిన్నం. శ్రీగణపతి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు సిద్దిఖీ అహ్మద్.. వినాయకుడికి 786 కేజీల లడ్డూను ఏర్పాటు చేశారు. శుక్రవారం నిమజ్జనం సందర్భంగా ఆయన.. భక్తులకు ఉచితంగా పంపిణీ చేసి అందరి మన్ననలు పొందారు. నగరంలోనే అత్యధికంగా 786 కిలోల లడ్డూను పెట్టిన ఘనత ఈ అసోయేషనెకే దక్కింది. గడిచిన 20 సంవత్సరాల నుంచి గణేశ్ లడ్డూను వేలం వేయకుండా భక్తులకు పంపిణీ చేయడం విశేషం.



బాలాజీనగర్ లడ్డూను తీసుకెళ్తున్న సాధుప్రతాప్‌రెడ్డి

## రూ.5.15 లక్షలు పలికిన బాలాజీనగర్ లడ్డూ

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను కాలనీ అధ్యక్షుడు సాదు ప్రతాప్‌రెడ్డి రూ.5.15 లక్షలకు దక్కించుకున్నారు. రెండో లడ్డూను భాస్కర్‌రావు రూ. 2.10 లక్షలకు, మూడో లడ్డూను చుక్కా శ్రీనివాస్ రూ.1.60 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, గత నెలలో అధ్యక్షుడిగా తాను గెలిచేందుకు సహకరించిన మిత్రులు, శ్రేయోభిలాషులకు ప్రసాదం పంపిణీ చేస్తానన్నారు. కూకట్‌పల్లి బాలాజీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం నిమజ్జనం నిర్వహించారు.

# ఆ 19 కిలోమీటర్లే కీలకం!

(5వ పేజీ తరువాయి)

ఈస్టుజోన్, సౌత్‌ఈస్టుజోన్, సౌత్ వెస్టు జోన్, వెస్టుజోన్ ఇలా అన్ని మార్గాల నుంచి ప్రధాన రహదారుల గుండా వచ్చే ట్రాఫిక్‌ను ఎక్కడిక్కడ మళ్లింపులు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులకు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించామని, కొన్ని జంక్షన్‌లలో బస్సులకు అనుమతిలేదని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలు సెప్టెంబరు 6 ఉదయం 6 గంటల నుంచి 7 ఉదయం 10 గంటల వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

### డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో విహంగ పర్యవేక్షణ

శోభాయాత్ర పర్యవేక్షణకు అద్భుతమైన విజువలైజేషన్‌తో (హైక్వాలిటీ) కూడిన 9 డ్రోన్లు వినియోగిస్తున్నట్లు సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. పెద్ద పెద్ద భవనాలకు ఏర్పాటు చేసిన సుమారు 100 హైరైజ్ కెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. సీసీటీవీలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి 250 కెమెరాలు ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. గణేష్ విగ్రహాలకు తొలిసారిగా క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. స్కాన్ చేస్తే ఆ విగ్రహం ఏ జోన్, ఏ డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధికి చెందినది అనే విషయాలు తెలుస్తాయన్నారు.

### పర్యావరణ అనుకూల విగ్రహాలకు ప్రత్యేకం

పర్యావరణానికి అనుకూలంగా ఉన్న విగ్రహాల నిమజ్జనాలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ సీపీ తెలిపారు. సంజీవయ్య పార్కు, జలవిహార్, ఎన్టీఆర్ స్టేడియం, ఐమాక్స్ థియేటర్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, చిలకలగూడ, అమీర్‌పేట, సైదాబాద్, చింతల్‌బస్తీ, గుడిమల్కాపూర్, అంబర్‌పేట ప్రాంతాల్లో బేబీ పాండ్స్, పోర్టబుల్ రబ్బర్ ట్యాంకులు, తవ్వకం ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



## రిచ్‌మౌండ్ విల్లా లడ్డూ రూ. 2.3 కోట్లు

నార్సింగ్ సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం బండ్లగూడలోని రిచ్‌మౌండ్ విల్లా టౌన్‌షిప్‌లో వినాయకుడి లడ్డూ శుక్రవారం రాత్రి రూ. 2.3 కోట్లు పలికింది. శుక్రవారం రాత్రి టౌన్‌షిప్ వాసులు.. లడ్డూను కొనుగోలు చేశారు. శనివారం ఉదయం వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తారు.

## పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

● ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపిన సీపీ ఆనంద్

చార్మినార్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రజలు కుల మతా లకు అతీతంగా కలిసి మెలసి అన్ని పండుగలు చేసుకుంటారని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన చార్మినార్ వద్ద బందోబస్తును పరిశీలించారు. అనంతరం ఏతేబర్ చౌక్ వద్ద ఉన్న రాయల్ క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో మార్కజే మెలద్ జులూస్ కమిటీ ఆధ్వర్యంలో మొహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన వస్తువుల ప్రదర్శన జరుగుతుండగా, కమిషనర్ అక్కడికి వెళ్లి కమిటీ ప్రతినిధులైన కామిల్ పాషా, జూనైద్ పాషా, సైఫ్ పాషా, శుజాద్దీన్ ఇఫ్తేకరితో పాటు నగరంలోని ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో హిందూ, ముస్లిం సిక్కు, క్రిస్టియన్స్ అన్ని పండుగలు కలిసి మెలసి శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ముస్లింలు మిలాద్-ఉన్-నబీ ర్యాలీని పోలీసుల విన్నపం మేరకు ఈనెల 14న జరుపుకోవడానికి అంగీకరించారని తెలిపారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, మార్కజే మెలద్ జులూస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి భారీ బందోబస్తు : డీసీపీ స్నేహా మెహ్రా

చార్మినార్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పాతబస్తీలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మండల డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. శుక్రవారం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, శనివారం నిర్వహించే సామూహిక గణేశ్ నిమజ్జనం కోసం వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు చేపట్టామన్నారు. బందోబస్తు కోసం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో పాటు వివిధ జిల్లాల నుంచి పోలీస్ సిబంది బందోబస్తులో పాల్గొంటారన్నారు.

## 'ధన్వంతరి బాధితులకు న్యాయం చేయాలి'

బర్కత్‌పుర, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, ధన్వంతరి ఇంటర్నేషనల్ సంస్థ ఆస్తులు అమ్మి బాధితులకు వడ్డీతో సహా పరిహారం చెల్లించాలని ధన్వంతరి అగ్రీస్డ్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నంరాజు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాజీ అధ్యక్షుడు ఆత్రేయ శర్మ, కార్యదర్శి అచ్యుతనంద రంగారావు ఉపాధ్యక్షుడు నర్సింహ్మామూర్తితో కలిసి ఆయన మాట్లాడారు. నాంపల్లి ఎంఎస్‌జే కోర్టు గత నెల 29న ధన్వంతరీ బాధితులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. సీసీఎస్ డీసీపీ శ్వేత, ఏసీపీ ఆదినారాయణ కృషి వల్లనే బాధితులకు న్యాయం జరుగుతుందని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



ఉత్తమ ఉపాధ్యాయులను అభినందిస్తున్న ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న నలుగురిని శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అభినందించారు. హైదరాబాద్ నగరంలోని శిల్పకళా వేదికలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. విశ్వవిద్యాలయం నుంచి అవార్డు పొందిన వారిలో డాక్టర్ జె.హేమంత్ కుమార్, డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, డాక్టర్ వి.హేమలత, డాక్టర్ జె.రాజేందర్, డాక్టర్ జె.సాయిప్రసాద్ ఉన్నారు.

## మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నార్సింగ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నార్సింగ్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు టి.అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీఎస్‌టీ స్లాబ్‌లలో మార్పులు చేసి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు.



హష్మత్‌గంజ్‌లోని మార్వాడీ గణేశ్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన భాగ్యనగర్ రాజాను దర్శించుకున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు, బీజేపీ నాయకులు



గుడిమల్కాపూర్ శివబాగ్‌లోని వినాయకుడి మండపంలో ప్రత్యేక పూజలు చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు



పుప్పాల్‌గూడ శివనగర్‌లో రూ. 3 లక్షల 71 వేలకు లడ్డూను కైవశం చేసుకున్న కస్తూరి శ్రావణ్



సిద్ధివినాయక యూత్ అసోసియేషన్‌లో రూ. 3 లక్షల 2 వేలకు లడ్డూను కైవశం చేసుకున్న గోకుల మహేశ్ యాదవ్ కొండె

# గణేశ్ మహరాజ్‌కు జై!

చార్మినార్, రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, భక్తులు దర్శించుకున్నారు.

- ఆబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ బృందం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి)

## భవిష్య స్కూల్ గణనాథుడి నిమజ్జనం

పహాడిషరీఫ్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలోని భవిష్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన గణేశుడికి కరస్పాండెంట్ రాఘవేందర్ రెడ్డి పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు దరించి భక్తి పాటలతో మళ్లీ రావయ్య గణపయ్య అంటూ సందడి చేశారు. గణనాథుడిని జల్‌పల్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జల్‌పల్లి పెద్దచెరువు వద్ద గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భవిష్య స్కూల్ సిబ్బంది, విద్యార్థులు

## నేడు సామూహిక గణేశ్ నిమజ్జనం

● కాషాయమయంగా నగరం



మాట్లాడుతున్న డాక్టర్ శశిధర్, శ్రీరామ్ వ్యాస్

అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భాగ్యనగరంలో శనివారం జరిగే 46వ అనంత చతుర్దశి సామూహిక గణేశ్ నిమజ్జనాలకు. నగరాన్ని కాషాయమయంగా మార్చినట్లు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ వెల్లడించారు. ఈ మేరకు, శుక్రవారం, సిద్ధి అంబర్బజార్‌లోని బాహితీ భవన్‌లో విలేకరు సమావేశంలో ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి, గోవింద్ రాటి, శ్రీరామ్ వ్యాస్, ఎం.రామరాజు, సంజయ్, ఘనాటేలతో, ఆయన మాట్లాడారు. 46వ సామూహిక గణేష్ నిమజ్జనం ఉత్సవాల ఊరేగింపు, 303 కిలోమీటర్ల పొడవునా సాగే రహదారులను కాషాయ రంగులతో అందంగా అలంకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారుల సమన్వయంతో 160 టీమ్‌లు పని చేస్తాయన్నారు. 34 ప్రధాన చెరువులు, 64 ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గణేశ్ శోభా యాత్రకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, ఉడిపి ఉత్తరాది పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామి, రామకృష్ణ మఠ్ స్వామి బోధమాయన్నదా తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఎంజేమార్కెట్ చౌరస్తాలోని స్వాగత వేదిక వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఆన్‌లైవ్ ద్వారా కేంద్ర హోంశాఖ మంత్రి అమీద్ షా భక్తులకు సందేశాన్ని ఇస్తారని వెల్లడించారు.

## బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలానికి సిద్ధం

పహాడిషరీఫ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ గణేశుడు నిమజ్జన వేడుకలకు సర్వం సన్నద్ధమైంది. 45 వసంతాల బాలాపూర్ గణేశ్ వార్షికోత్సవ వేడుకల ముగింపు ఉత్సవాలు, 2025 బాలాపూర్ గణేశ్ లడ్డూ ఈసారి వేలంలో ఎవరికి సొంతం కానుందో.. మరికొన్ని గంటల్లో భవితవ్యం తేలనుంది. 2024లో బాలాపూర్‌కు చెందిన కోలన్ శంకర్‌రెడ్డి రూ.30,01000కు సొంతం చేసుకున్నారు. ఈఏడాది బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలం ఆసక్తి రేకెత్తించనుంది. ఈ సారి లడ్డూ వేలంలో పాల్గొనేందుకు ఇప్పటివరకు ఐదుగురు మాత్రమే ఒక్కొక్కరు రూ. 10వేలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకున్నారు. గత సంవత్సరం వేలంలో మొత్తాన్ని రూ.30,01000 డిపాజిట్‌గా చూపిస్తేనే వేలం పాడడానికి అర్హులుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో చివరగా శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు రూ.30,01000 డిపాజిట్ చెల్లించిన వారికే లడ్డూ వేలంలో పాల్గొనడానికి అర్హులని బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్యాం నిరంజన్ రెడ్డి తెలిపారు.

● పది రోజులుగా ప్రతి రోజూ బాలాపూర్ గణేశుడిని 40 నుంచి 60 వేల మంది దర్శించుకోగా, సెలవుదినాల్లో 90 వేల నుంచి లక్ష మంది భక్తులు దర్శించుకున్నట్టు గణేశ్ ఉత్సవ సమితి తెలిపింది. ఎప్పుడూలేని విధంగా ఈ సంవత్సరం 12లక్షల మందికి పైగా భక్తులు బాలాపూర్ గణపతిని దర్శించుకున్నట్టు చెప్పారు. తెల్లవారుజామున 5 గంటలకు బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి పూజా కార్యక్రమాలు ప్రారంభమై ఉదయం 6.30 గంటల నుంచి బాలాపూర్ పురవీధులలో ఊరేగింపు కొనసాగుతుందన్నారు. 9 గంటలకు డీసీఎం వాహనంపై బొడ్రాయి వద్దకు చేరుకుంటుంది. ఉదయం 9.30గంటలకు లడ్డూ వేలం ప్రారంభమవుతుంది. బాలాపూర్ గణేశ్ నిమజ్జన శోభా యాత్రకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి తెలిపారు.

## రోడ్డు దాటుతూ యువకుడి మృతి

రాజేంద్రనగర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అత్తాపూర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో ఆరాంఘర్ పిల్లర్ నెంబర్ 310 వద్ద శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనికి చెందిన సన్నీ(22) రోడ్డు దాటుతుండగా శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ వెళ్తున్న ఓ ఇటుకల లోడ్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సన్నీని ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. వినాయకుడి నిమజ్జనానికి తీసుకెళ్తున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పప్పు లోడ్ లారీ బోల్తా

రాజేంద్రనగర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో శుక్రవారం తెల్లవారు జామున మహారాష్ట్ర నుంచి బేగంబజార్‌కు వస్తున్న పప్పులోడ్‌తో ఉన్న లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించి క్రేయిన్ ద్వారా లారీని రోడ్డుపై నుంచి పక్కకు తొలగించారు.

## నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ దాడులు

● ఇద్దరి గంజాయి విక్రేతలు,

బెల్లం రవాణా చేస్తున్న మహిళ అరెస్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలపై ఎక్సైజ్ సిబ్బంది వరుస దాడులు చేస్తున్నారు. నగరంలో పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో ఇద్దరు గంజాయి విక్రేతలు పట్టుపడ్డారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం రవాణా చేస్తున్న మహిళను కూడా అరెస్ట్ చేశారు. నాంపల్లి అఫ్జల్‌సాగర్ ప్రాంతంలో సచిన్ ఉపాధ్యాయ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడు. సమాచారమందుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్ అఫ్జల్‌సాగర్‌లోని అతడి ఇంటిపై దాడి చేసి, 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఉప్పల్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న బాగ్యవత్‌ను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది 510 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● గుడుంబా తయారీకి వినియోగించే బెల్లాన్ని నగరం నుంచి అమన్‌గల్‌కు రవాణా చేస్తున్న హైదరాబాద్ అమన్‌గల్‌కు చెందిన ఎల్లమ్మను ఎక్సైజ్ అధికారులు ఎంజీబీఎస్ బస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి 150కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/HgP6piiలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

## రేపు హిమాలయ ధ్యానయోగం లైఫ్ మేనేజ్‌మెంట్

బర్కత్‌పుర, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హిమాలయ ధ్యానయోగం ఆధ్వర్యంలో లైఫ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై ఈనెల 7న కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో సాయంత్రం 4.30 గంటలకు పూజ్య గురుమా ప్రవచనం ఉంటుందని లవ్ ఫర్ కౌవ్ ఫౌండేషన్ ట్రస్టీ రిధిష్ జాగీర్దార్ తెలిపారు. మన జీవితంలో తలెత్తే అనేక ప్రశ్నలకు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారం లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 8500369811 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈసందర్భంగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుజరాతి ప్రగతి సమాజ్ సభ్యులు దినేష్ గోసార్, హిమాలయ మెడిటేషన్ ముంబాయి ప్రతినిధి మర్ష ధరంషి, హైదరాబాద్ సభ్యులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికలకు మజ్లిస్ సమాయత్తం

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న మహారాష్ట్ర మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా చాటేందుకు కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పార్టీ శ్రేణులను ఆదేశించారు. దారుస్సలాంలో పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మజ్లిస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు ఇంతియాజ్ జలీల్ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసదుద్దీన్ మహారాష్ట్ర మునిసిపల్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ముంబై, పుణె, నాగ్‌పూర్, ఔరంగాబాద్, నాసిక్, షోలాపూర్, జాల్నా, పర్భని, నాందేడ్, బీడ్ తదితర మునిసిపాలిటీలలో మజ్లిస్ బలాన్ని పెంచుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.





# అశ్వికదళంలో మహిళలు

## మొదటిసారిగా నిమజ్జన బందోబస్తులో వినియోగించాలని నిర్ణయం


గుర్రాలపై ఎక్కి సెల్యూట్ చేస్తున్న మహిళా పోలీసులు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితామూర్తి ఆధ్వర్యంలో ధైర్యవంతులైన 10 మంది ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్) మహిళా కానిస్టేబుళ్లను అశ్వికదళానికి ఎంపిక చేసి మౌంటెడ్ పోలీస్ దళంలో ఉన్న శిక్షకులతో ఆరు నెలల పాటు హార్స్ రైడింగ్ (గుర్రపు స్వారీ)లో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. మొట్టమొదటిసారిగా గణేశ్ నిమజ్జన బందోబస్తులో అశ్వికదళం మహిళా బృందాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామన్నారు. గోషామహల్ స్టేడియంలో శుక్రవారం మహిళా బృందం నిర్వహించిన హార్స్ రైడింగ్ ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళా కానిస్టేబుళ్లను సీపీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. వినాయకచవితి, మొహర్రం, హనుమాన్ శోభాయాత్ర వంటి ప్రతిష్ఠాత్మకమైన పండగల్లో మౌంటెడ్ పోలీసులు కీలక పాత్ర పోషిస్తుంటారన్నారు. ప్రస్తుతం 50 గుర్రాలు ఉన్నాయన్నారు. అశ్వికదళం సిటీ పోలీస్ శాఖకు వన్నె తెస్తుందన్నారు.

### డాగ్ స్క్వాడ్ విస్తరణ

డాగ్ స్క్వాడ్‌ను విస్తరించడానికి నిర్ణయించామని సీపీ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 34 డాగ్ స్క్వాడ్‌ల సంఖ్యను 54కు పెంచాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో శునకాల నాణ్యతను, పనితీరును మెరుగుపరచడానికి అందుకు అనువైన బ్రీడ్స్‌ను ఎంపిక చేయడానికి డీసీపీలు శ్వేత, రక్షితామూర్తి, దార కవిత, చంద్రమోహన్ సహా.. సీఎస్‌డబ్ల్యూ అధికారితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా ఉన్న డాగ్ బ్రీడర్ల నుంచి నాణ్యమైన శునకాలను ఎంపిక చేస్తోందన్నారు. మొదటి దశలో 12 శునకాలను సేకరించారు. ప్రస్తుతం వాటి వయస్సు రెండు నెలలు, మరికొద్దిరోజుల్లో ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ(ఐఐటీఏ)లో శిక్షణ పొందిన తర్వాత బృందంలో చేర్చుకుంటామని తెలిపారు. బాంబులు, మాదకద్రవ్యాలు, నేరస్థుల గుర్తింపు వంటి వాటిలో వీటిని వినియోగిస్తామన్నారు. 12 జాగిలాలతో డాగ్ స్క్వాడ్స్ సంఖ్య 46కు చేరింది. త్వరలోనే వాటి సంఖ్యను 54కు పెంచుతామని, భవిష్యత్తులో పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని 60 జాగిలాలకు సరిపడేలా డాగ్ కెన్నెల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు.

- గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రికి కేటాయించగా మిగిలిన 11.30 ఎకరాల స్థలంలో పోలీస్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ అందులోనే సిటీ సెక్యూరిటీ వింగ్, హోంగార్డుల ఆర్గనైజేషన్, సీటీసీ, స్పోర్ట్స్ కార్యాలయం, డాగ్ కెన్నెల్, జాగిలాల ప్లేయింగ్ ఏరియా, అమరవీరుల స్థూపం, సెల్యూటింగ్ బేస్, స్పోర్ట్స్ ఏరియా, అశ్వికదళం బ్యారెక్‌లు, రైడర్స్ ఫీడింగ్ ఏరియాలను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్స్‌ను ఈనెల 8న పూర్తి చేస్తామని సీపీ తెలిపారు.

## నగరంలో అన్నిరకాల ఆధునిక చికిత్సలు

- కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు
- 'కిమ్స్'లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ పదేళ్ల విజయోత్సవం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు రక్త క్యాన్సర్.. మరే సమస్య వచ్చినా రక్తమూలుగ మార్పిడి చేయించుకోవాలంటే రాయవెల్లూరులోని సీఎంసీకి, ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడా పరిస్థితి మారిపోయిందని, హైదరాబాద్‌లో అన్నిరకాల ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని కిమ్స్ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. కిమ్స్‌లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి 10 ఏళ్లు అయిన సందర్భంగా విజయోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రక్తమూలుగ మార్పిడి విషయంలో కిమ్స్ ఆస్పత్రి గణనీయమైన విజయాలు సాధించిందన్నారు. హైదరాబాద్‌లో ఈ తరహా చికిత్సలు మొదలుపెట్టిన మొట్టమొదటి ఆస్పత్రి కిమ్స్ కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు నరేందర్‌కుమార్, గురవారెడ్డి, మణిమాలరావు, సంబిత్ సాహు, ఫిలాంత్రోపిస్టులు సుధారెడ్డి, పింకీ రెడ్డి పాల్గొన్నారు.


బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ 10 ఏళ్ల విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, వైద్యులు


డిజైన్ డెమోక్రసీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పింకిరెడ్డి

## ప్రపంచ డిజైన్ హబ్‌గా హైదరాబాద్

- హైటెక్స్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన పింకిరెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డిజైన్ హబ్‌గా హైదరాబాద్ నిలుస్తుందని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ మాజీ చైర్‌పర్సన్ పింకిరెడ్డి అన్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో భారతదేశపు ప్రీమియర్ డిజైన్ అండ్ ఆర్కిటెక్చర్ ఫెస్టివల్, డిజైన్ డెమోక్రసీ-2025 ఎగ్జిబిషన్‌ను క్రెడాయ్ ప్రెసిడెంట్ ఎలక్ట్ గుమ్మిరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రదర్శనలో తెలంగాణ మ్యూజియంతోపాటు అబిన్ చౌదరి, స్నేహశ్రీ నంది క్యూరేట్ చేసిన గ్యాలరీ ఆఫ్ సస్టైనబిలిటీ, ఫరా అహ్మద్ క్యురేట్ చేసిన వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డిజైన్ డెమోక్రసీ వ్యవస్థాపకులు శైలజా పట్వారీ, పల్లికా శ్రీవాస్తవ్, అర్మున్ రతి మాట్లాడుతూ డిజైన్ డెమోక్రసీతో ఓ ప్రత్యేక వేదిక నిర్మించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఈనెల 7 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

## వచ్చేనెల 12న క్యాన్సర్‌పై అవగాహన రన్

హైటెక్‌సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కంటే నెగిటివిటీతో నిండిన ప్రపంచంలో జీవించడం చాలా కష్టమని సినీనటి ఐశ్వర్య రాజేష్ అన్నారు. నటుడు ఆలీ మాట్లాడుతూ తల్లి తండ్రులు మనకు జన్మనిస్తే.. వైద్యులు జీవితాన్ని ఇస్తారన్నారు. క్యాన్సర్ పట్ల పాజిటివ్ మెసేజ్ ఇచ్చే పరుగు చాలా గొప్పదన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 12న గచ్చిబౌలి స్టేడియంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన రన్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం హోటల్ దసపల్లాలో గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్‌కు సంబంధించిన టీషర్ట్, మెడల్‌ను ఐశ్వర్య రాజేష్, ఆలీ ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చినబాబు సుంకవల్లి మాట్లాడుతూ 2కే, 5కే, 10కే విభాగాల్లో రన్ నిర్వహిస్తున్నామన్నారు. రన్‌లో పాల్గొనే వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ గ్రేసిక్యాన్సర్ రన్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.


టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న సినీ నటులు ఐశ్వర్య రాజేష్, ఆలీ


'సర్వేపల్లి'కి నివాళి
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీజేపీ నగర కార్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


ట్యాంక్‌బండ్‌పై సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కవాడిగూడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నేత శివరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామచందర్‌రావు మాట్లాడుతూ గురువులేని విద్యకు గుర్తింపు లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహాకాళి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

## రంజింపజేసిన భన్వీ శివతాండవం

రవీంద్రభారతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురువులనూ పూజిస్తూ సాగిన నృత్యోత్సవంలో భాగంగా చిన్నారి నర్తకి భన్వీ ప్రదర్శించిన శివతాండవం నాట్యం ప్రేక్షకులను రంజింపజేసింది. శుక్రవారం రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రారా వేణుగోపాల.. గురుదేవోభవ శీర్షికన గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ నృత్య అకాడమీలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. నిజాంపేటకు చెందిన రమాదేవి నృత్య అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి లయన్ రమణారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదరగుప్తా, నాట్యగురువులు డా.పసుమర్తి శేషుబాబు, రమాదేవి కళాకారులను సత్కరించి అభినందించారు. దామోదర గుప్తా మాట్లాడుతూ గురువులను స్మరిస్తూ నృత్యాంశాలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు.


నాట్యం చేస్తున్న నర్తకి

## బోయినపల్లి మార్కెట్‌ను సందర్శించిన మూడు రాష్ట్రాల అధికారుల బృందం

సికింద్రాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి వ్యవసాయ మార్కెట్‌ను మూడు రాష్ట్రాల అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. మార్కెట్‌లో జరిగే కార్యకలాపాలను పరిశీలించారు. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లలోని మార్కెట్ బోర్డుకు చెందిన అధికారులు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మార్కెట్‌లో కలియతిరిగి అధ్యయనం చేశారు. బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డీబీ దేవేందర్, ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకన్న వారికి స్వాగతం పలికారు.


బోయినపల్లి మార్కెట్‌ను సందర్శించిన ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాల అధికారులు

# అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాలో ఐఐటీహెచ్

## ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానం

కంది, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల జాబితాలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ నిలిచింది. కేంద్ర మంత్రిత్వశాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్స్ ఫ్రేమ్‌వర్క్స్)-2025 ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానంలో నిలిచింది. ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఐఐటీహెచ్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ఇంజనీరింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా ఐఐటీహెచ్ ఏడో స్థానం, ఇన్నోవేషన్‌లో ఆరో స్థానం, పరిశోధనల్లో 15వ స్థానం, ఓవరాల్‌గా 12వ స్థానంలో ఐఐటీ-హెచ్ ర్యాంకులు సాధించడం గర్వకారణమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. గతేడాది ఇదే ర్యాంకింగ్‌లో 8వ స్థానంలో ఉండగా ఈసారి గువాహటి ఐఐటీని అధిగమించింది.

### పదిహేడేళ్లలో ఉత్తమంగా..

2008లో స్థాపించబడిన ఐఐటీహెచ్, 17 సంవత్సరాల వ్యవధిలో విద్య, పరిశోధన, సాంకేతికత, అభివృద్ధి, స్టార్టప్‌లలో గౌరవనీయమైన స్థానానికి చేరుకుంది. ఎన్ఐఆర్ఎఫ్ ప్రారంభించినప్పటి నుంచి ఐఐటీహెచ్ టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో తన ర్యాంక్‌ను నిలుపుకుంటుంది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 2025-26 విద్యాసంవత్సరంలో 664వ స్థానంలో ఉంది. భారతదేశంలోని టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటిగా నిలిచింది. ఐఐటీహెచ్ 'మానవత్వం కోసం టెక్నాలజీని కనిపెట్టడం, ఆవిష్కరణలు' అనే నినాదంతో శ్రేష్ఠత కోసం కృషి చేస్తోంది.


ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్

**పరిశోధనలు, ప్రాజెక్ట్‌లను బలపరుస్తాం**

ఐఐటీహెచ్‌ను ప్రపంచ స్థాయి పరిశోధనల ప్రాజెక్టులలో బలమైన శక్తిగా మారుస్తాం. 5,040 ప్రాజెక్టులతో బలమైన పరిశోధన దృష్టిని కలిగి ఉంది. రూ.1,600 కోట్ల పరిశోధనాభివృద్ధి నిధులు, 580 పేటెంట్లు, దాదాపు 320 స్టార్టప్‌లు రూ.1,500 కోట్ల ఆదాయంతో 1,100 ఉద్యోగాలను సృష్టించాయి.
- బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డైరెక్టర్




స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

## మిలిటరీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- రూ. 1.50 లక్షల విలువైన 50 బాటిళ్లు, బైక్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలిటరీ మద్యాన్ని అధిక ధరకు విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 1.50 లక్షల విలువైన 50 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ ఏఈఎస్ ముకుందరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన వీర స్వాములు(47) డిఫెన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులతో పరిచయం పెంచుకుని వారి నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు ఈసీఐఎల్ త్రిశూల్ బార్ రోడ్‌లోగల అతడి ఇంటిపై శుక్రవారం దాడి చేశారు. రూ. 1.50 లక్షల విలువైన మద్యం బాటిళ్లతోపాటు బైక్ స్వాధీనం చేసుకున్నారు.

## బీహెచ్ఈఎల్ కార్మిక నేత ఎల్లయ్య కన్నుమూత

- 9 సార్లు భెల్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సేవలు

అమీన్‌పూర్/రామాయంపేట్/భెల్‌కాలనీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్మిక నాయకుడు జి.ఎల్లయ్య(86) శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎల్లయ్య స్వగ్రామం మెదక్ జిల్లా రామాయంపేట మండలం, అక్కన్నపేట. బీహెచ్ఈఎల్ అధికారిక కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున 9 సార్లు విజయం సాధించి అధ్యక్షుడిగా సేవలు అందించారు. భెల్ ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ యువతకు న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేశారు. వేలాది మంది భెల్ ఉద్యోగులకు సొంత ఇళ్లను సమకూర్చడంలో కీలకపాత్ర పోషించారని భెల్ విశ్రాంత ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఎల్లయ్య మృతి కార్మికలోకానికి తీరనిలోటని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి ఎల్లయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎల్లయ్య మృతిపట్ల కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం ప్రకటించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, చిన్నపరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, టీఎన్‌టీయూసీ నాయకుడు సత్తయ్య, ఐఎన్‌టీయూసీ భెల్ సీనియర్ నాయకుడు రెహమాన్, కార్మిక సంఘాల నాయకులు ఎల్లయ్యకు నివాళులర్పించారు.


ఎల్లయ్య (ఫైల్)